


# అమెరికా ఇల్లాలి ముచ్చట్లు

## శ్యామలాదేవి దశిక



అమెరికా ఐనా, అమలాపురమైనా ఇల్లాలు..ఇల్లాలే. ముచ్చట్లు ముచ్చట్లే..

ఓ అమెరికా ఇల్లాలు నెల నెలా  మీతో పంచుకుంటున్న ముచ్చట్ల మురిపాలు..!

## హ్యాండు బ్యాగు

ఏమిటీ ! నా బర్తుడే గిఫ్ట్‌గా ఈ బ్యాగు కొన్నారా?
ఈ భోషాణమంత బ్యాగ్ ఇప్పుడు నేనేం చేసుకోవాలిటా?
నాకు అన్నింటికి వీలుగా వుంటుందని కొన్నారా?
నేను మొయ్యాలే గాని బ్యాగేం ఖర్మ బస్తాయే కొనిస్తారు !
మన పెళ్ళైన కొత్తల్లో నా పుట్టినరోజుకు మీరు నాకు హ్యాండు బ్యాగు కొనిచ్చారు.
ఆ రోజుల్లో మీరిచ్చిన ఆ బ్యాగుని చూసుకుని మురిసిపోయాను !
అందులో నా అలంకార వస్తువులు పెట్టుకోవాలని చెప్పారు.
వెంటనే నా పౌడరు, తిలకం, కొత్త జేబురుమాలు అందులో పెట్టుకున్నాను.
ఆ రోజు సాయత్రం నన్ను మీరు సినిమాకు కూడా తీసికెళ్ళారు.
మీరు రిక్షా మాట్లాడుతుంటే, నేను నడచి వెళ్దామన్నాను గుర్తుందా?
మెత్తగా అందంగా వున్న ఆ బ్యాగు పట్టుకుని రోడ్డుమీద నడుస్తూ నా అందం రెట్టింపయిందనుకున్నాను !
ఈ బ్యాగు నా సొంతం అని, అందులో నా వస్తువులన్నీ దాచుకోవచ్చని ఆనందపడ్డాను.
కానీ, అమెరికా వచ్చాక తెలిసింది హ్యాండు బ్యాగు ఆడవాళ్ళ అలంకారానికి గుర్తు కాదని, అది వాళ్ళ బాధ్యతలకు గుర్తూ అని.

బయటికెళ్ళినా అందరి అవసరాలు తీరుస్తూ వుండాలి కాబట్టి ఆడవాళ్ళకు హ్యాండు బ్యాగు చాలా అవసరమని అనుభవం మీద తెలుసుకున్నాను. వచ్చిన కొత్తల్లో పౌడరు, లిప్ స్టిక్, పెర్ ఫ్యూము పెట్టుకునేదాన్ని. ఒళ్ళో నా బ్యాగు ఖాళీగా వుందని తెలుసుకున్న మీరు నెమ్మదిగా టోల్ టిక్కెట్లు, టోల్ బూత్ దగ్గర పే చెయ్యడానికి తెచ్చిన చిల్లర డబ్బులు, టోకెన్లు, మీ మ్యాపుల కట్ట ఇచ్చి బ్యాగులో పెట్టుకోమనేవారు. అప్పుడప్పుడు మీ సిగరెట్లు కూడా నా బ్యాగులో పెట్టేవారు.
తర్వాత పిల్లలొచ్చారు. వాళ్ళు పసివాళ్ళుగా వున్నప్పుడు హ్యాండు బ్యాగుతో పాటు డైపర్ బ్యాగు సరేసరి !
తర్వాత పిల్లలు చిన్నవయసులో వున్నప్పుడు కారెక్కిన క్షణం నుంచి 'ఆర్ వుయ్ దేర్ ఎట్' అంటూ అడిగే వాళ్ళను శాంతపరచటానికి బ్యాగులో కుక్కీలు, క్యాండీలు, చాక్లెట్లు, చూయింగమ్ములు పెట్టుకునేదాన్ని.

పిల్లలు కాస్త పెద్దవాళ్ళయ్యాక వాళ్ళను మనతో పార్టీలకు తీసికెళ్ళడానికి గగనమయ్యేది. 'డు వుయ్ హావ్ టు కమ్?' అంటూ నన్ను ఉద్ధరిస్తున్నట్లు బయలుదేరేవారు. ఎక్కడికెళ్ళాలన్నా ముందుగా వాళ్ళ బుక్సు , టేపులు, బాల్స్, పజిల్స్ నా బ్యాగులో కుక్కి మరీ కారెక్కేవారు. ఏవన్నా అంటే, 'వుయ్ నీడ్ దెమ్' అనేవారు.

వాళ్ళ వస్తువులతో నా బ్యాగు ఎప్పుడూ మా ఊళ్ళో నాదస్వరం ఊదే మస్తాను మొహంలా వుండేది !

నా బ్యాగు అని పేరుకే గాని దాన్నిండా పిల్లల వస్తువులే వుండేవి.

తెగిపోయిన టేపులు, మెల్ట్ అయిన చాక్లెట్టులు, ఎండిపోయిన చూయింగమ్ములు, ముక్కులు విరిగిన పెన్సిళ్ళు, రాయని పెన్నులు-------

ఇంట్లో ఎవరికి ఏ వస్తువు కనిపించకపోయినా వెంటనే "చెక్ మామ్స్ బ్యాగ్" అంటూ దాడి చేస్తారు. ఆ బ్యాగ్ మీ సొంతమే అన్నట్లు సోదా చెయ్యడమే కాకుండా అవసరమైతే కిందా మీదా బోర్లించి కావాల్సింది కనబడితే తీసేసుకుని, కనిపించకపోతే నన్ను బ్లేమ్ చేసి వెళ్ళిపోతారు.

పిల్లలు పెద్దవాళ్ళైన తర్వాత హమ్మయ్య అనుకుని నా హ్యాండు బ్యాగు నా సొంతం అవుతుందని భ్రమ పడ్డాను.

కానీ మీరు నాకు ఇంకో పిల్లాడై కూర్చున్నారు !

గడప దాటితే చాలు "ఇదిగో" అంటూ వాలెట్, కళ్ళజోడు, పెన్ను, ఆఫీసు తాళాలు అంటూ చదివింపులు మొదలుపెడ్తారు. అసలు మీ వస్తువులు నేనెందుకు మొయ్యాలిటా? నాకు తెలీకడుగుతా.

ఏవన్నా అంటే పిల్లలకంటే ఎక్కువగా మీ పన్లలను సమర్థించుకుంటారు.

పర్సు బ్యాక్ పోకెట్టులో పెట్టుక్కూర్చుంటే నడ్డినెప్పి.

తాళాలు జేబులోవుంటే గుచ్చుకుంటాయి.

కళ్ళజోడు షర్టు జేబులో పెట్టుకుంటే వంగినప్పుడల్లా టప్పుమని కింద పడుతుంది.

అందుకని నా హ్యాండు బ్యాగులో పెడితే ఏ గొడవా వుండదు మామూలే-----

పోనీ అంతటితో ఆగారా అంటే లేదే

లేటు వయసులో ఘాటు ప్రేమ అని ఇంత వయసొచ్చి మళ్ళీ తల్లినయినట్టుంది నాపని !

పిల్లలు పసివాళ్ళప్పుడు కూడా నాకు ఇంత పని వుండేది కాదు.

మరి ఇప్పుడు ఇల్లు కదలాలంటే ఎంత తతంగం !

'తింటే ఆయాసం, తినకపోతే నీరసం' అని మీకు ఎప్పుడు ఆకలేస్తుందో, ఎక్కడ నీరసం వచ్చి మీ షుగర్ లెవెల్ పడిపోతుందో అని భయం. దీనికి తోడు సీజను మారితే చాలు నేనున్నానంటూ తయరయ్యే ఆస్మా ఒకటి. కీళ్ళబాధ వుండనే వుంది. ఇందుకోసం జ్యూస్ బాటిల్స్, నీళ్ళ సీసాలు , ఎమర్జెన్సీ ఫుడ్డు, గ్లూకోజ్ మానిటరు, ఇన్‌హేలరు, కీళ్ళనొప్పి క్రీము, మీ మూతీ ముక్కు తుడుచుకోవడానికి టవలు, టిస్యూలు, మీ సెల్ ఫోను, నా నెత్తికాయ------

పెళ్ళి---పిల్లలు---సంసారం---బాధ్యతలు పెరిగినట్లే నా బ్యాగు బరువు కూడా పెరుగుతూ వచ్చింది.

కాలంతో పాటు మనమూ మారుతున్నట్లు నా హ్యాండు బ్యాగు కూడా అవసరానికి అనుగుణంగా సైజు, క్వాలిటీ, ఎఫిషియెన్సీ మారుతూ వుంటుంది. ఏ వెకేషనకు వెళ్ళినా మీరు కేర్ ఫ్రీ గా తిరిగేస్తూ నేను ఎక్కడ రిలాక్స్ అవుతానో అని "నీ హ్యాండు బ్యాగు జాగ్రత్త"

అంటూ రిమైండ్ చేస్తూ వుంటారు !

ఇండియా వెళ్ళినప్పుడల్లా, రైలు ప్రయాణాల్లో మీరు- పిల్లలూ సుబ్బరంగా భోజనాలు కానిచ్చి బర్తులు పరుచుకుని గురకలు పెట్టి నిద్ర పోతూ వుంటారు. నేను నా బ్యాగులో వున్న డబ్బు కట్టలు, టిక్కెట్లు, పాసుపోర్టులు ఎవడూ ఎత్తుకుపోకుండా కాపలా కాస్తూ వుంటాను. బాధ్యత అనే  పదవి మొగాళ్ళ సొత్తే అయినా దాన్ని కాపలాకాసి కాపాడేది ఆడదేకదా?

మీ అవసరాలకు అంతరాయం కలగకుండా వుండటానికే మీ మగవాళ్ళు "లేడీస్ హ్యాండు బ్యాగు" ని కనిపెట్టారు. అందుకే ఎన్నో అందాల్ని విరజిమ్మేటట్లు తయారుచేసారు !

పైకి ఎంతో మెత్తగా, సుకుమారంగా కనపడే ఈ హ్యాండు బ్యాగులు లోపల ఎంతో బరువును మోస్తూవుంటాయి ఆడదానిలాగే !